# అడ్డం తిరిగిన కథ ★

రచన :
బి. వి. వి. ఆర్. సుబ్బారావు

గోపాలం ఆయింటి వీధి గది అద్దెకు తీసుకుని ఒక నెలరోజులు కావస్తోంది. హొటలు భోజనం, కాలేజీ చదువు, గదిలో మకాము. ఇదే ఆతడి కార్యక్రమము. ఇక ఆ యింటిలో యాభై ఏళ్లు పైపడిన ఆ యింటి యజమాని అనంతయ్యా అతని భార్య మాలతి మాత్రమే వుంటున్నారు. మాలతి అనంతయ్యగారి ద్వితీయం కావడంవల్ల వయస్సులో మరికొంచం చిన్నదనే చెప్పుకోవాలి. ఆమెకు యిరువై సంవత్సరాలు మించి వుండవు. సన్నగా నాజూకుగా వుండే అమె రూపం ప్రతివారిని ఆకర్షిస్తుందని చెప్పుకుతీరాలి మరి!!

వీధి గదిలోకి అద్దెకువచ్చిన గోపాలం కూడా కొంచం ఇంచుమించు అందగాడే. అందానికితోడు అతని వేషభాషలు కొంచం మెరుగులు తిద్దుతూవుంటాయి, గోపాలం గదిలో చేరిన మొదటిరోజునే మాలతి చిన్నారి హృదయం కొంచంగా కలవర పడింది. అనంతయ్యను భర్తగా స్వీకరించడానికి మాలతి హృదయంలో ఇచ్ఛ లేకపోయినా, కట్నం కానుకలు యిచ్చి తగిన సంబంధం తేలేని తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితులు అమెను తల వంచి యీ పెళ్లికి సిద్ధపడేటట్లుచేశాయి. షష్టిపూర్తికి దగ్గిరలోవున్న అనంతయ్య పెండ్లికొడుకయ్యాడు. మనసులేని మొగుడితో భారంగా దొర్లించేస్తోంది రోజులను మాలతి.

మాలతి కాపురానికి వచ్చేనాటికి వీధి గదిలో ఏవో సామానులు పడివుండేవి. తరువాత కొన్నాళ్లకు అనంతయ్యకు ఆ వీధిగదిని ఎవరికైనా అద్దెకు యిచ్చి నెలకు ఐదారు రూపాయలు సంపాదించాలనే సదభిప్రాయం కలిగింది. అప్పటిలో ఒక ముసలి మాష్టరు గారికి ఆ గదిని ఐదు రూపాయిలకు అద్దెకు యిచ్చాడు. ఆయన నాలుగైదు నెలలు వుండి తరువాత బదిలీ అయి వెళ్లిపోయారు. ఇపుడు గోపాలం ఆ గదిలో చేరాడు.

గోపాలం గదిలో చేరినది మొదలు మాలతి మనస్సు తహతహలాడసాగింది. ఎలాగైనా గోపాలాన్ని ఆకర్షించాలని, ఏమేమో మాలతి ఆశాసౌధాలు నిర్మించుకోసాగింది. ఇక అతడిని ఆకర్షించడానికి అనేకవిధాలుగా భర్త యింట లేని ప్రతి క్షణం సద్వినియోగం చేసుకోసాగింది. అతడితో చనువుగా, చొరవగా మాట్లాడసాగేది. కాని గోపాలం తప్పుకు తప్పుకు తిరగసాగాడు. అసలు యింతకూ గోపాలం మనస్తత్వమే వేరు. జీవితంలో నైతిక విలువలను బాగా గ్రహించినవ్యక్తి కావడంవలన మాలతికి దూర దూరంగా వుంటూన్నాడు.

గోపాలానికి ఆ గదిలో నివాసం అసిధారావ్రతంగానే కనపడసాగింది రాను రాను...

* * *

నెలరోజులు గతించాయి. ఈ నెల రోజులలోను మాలతి మాట్లాడించబోయినా, ఏదో ముక్తసరిగా సమాధానం చెప్పి తప్పించుకు తిరగసాగాడు గోపాలం. కాని మాలతి రోజురోజుకు అతడికి మరింత చేరువుకు రావాలని ప్రయత్నించసాగింది. తగిన సమయం కోసం ఎదురుతెన్నులు చూస్తోంది. మాలతి అదృష్టవశాత్తు అయితేనేం, గోపాలం కర్మవశాత్తు అయితేనేం ఒకానొక రోజున ఆ అవకాశం అనుకోని చుట్టం మాదిరిగా రానేవచ్చింది. అనంతయ్య మరునాటికికాని రాని వూరు ప్రయాణం చేయవలసి రావడమే!

ఆరోజున భర్త యింటలేడు. గోపాలానికి యీ సంగతి తెలియనే తెలియదు. ఆ రోజు సాయంకాలం మామూలుగా కాలేజీ విడిచిపెట్టాక కాసేపు షికారుకుపోయి భోంచేసి రాత్రి ఎనిమిది గంటలకల్లా గదికి చేరుకున్నాడు.

మాలతి అప్పటికే భోజనం పూర్తి చేసుకుని గోపాలం రాకకు ఎదురుచూడసాగింది. దీపం వెలిగించి, బట్టలు మార్చుకుని కుర్చీలో కూర్చుని చదువుకో సాగాడు.

మాలతి, గోపాలం రావడం. దీపం వెలిగించి బట్టలు మార్చి చదువుకు ఉపక్రమించడం, అన్నీ కనిపెడుతూనే వుంది ఇంతకూ ఆమెకు మనసు మనసులో లేదు ఎలాగైనా గోపాలాన్ని లొంగదీసుకోవాలనే వాంఛ ఆమెను వేధించసాగింది. ఏమేమో ఆలోచించుకుంటూ తన గదిలో మంచంమీద పడుకుంది. వీధి తలుపులు దగ్గరగావేసి వున్నై. గోడనున్న గడియారం తొమ్మిది కొట్టింది. ఇంతలో తళుక్కున మెరపు మెరసినట్లు ఏదో ఆలోచన తట్టింది మాలతికి. తనలో తానే నవ్వుకుంది సన్నగా. మంచంమీదనుండిలేచి వంటగదివైపు నడిచి వెళ్లిపోయింది.

వంటగది ఓగ్గరకు వెళ్లిన మాలతి ఒక్కసారిగా కెవ్వున అరచింది. ఆ అరుపును అనుసరిస్తూనే 'బాబోయ్, పాము. పాము...రండి......రండి" అంటూ కేకలువేసింది వణికే కంఠంతో, యీ అకస్మికంగా వినవచ్చిన కేకలకు గోపాలం త్రుళ్లిపడ్డాడు. వెంటనేలేచి యింట్లో ప్రవేశించి మాలుతి కేకల వినవచ్చిన వంటగదివైపు పరుగెత్తాడు టార్చిలైటుతో. "పాము ఎక్కడండీ" అంటూ

గోపాలం గాభరాగా మాలతిని ప్రశ్నించాడు. "అలా దొడ్డిలోనికి దిగిపోయిందండీ." అంది సాఫీగాను తాపీగాను స్వరాన్ని మార్చేసి. గోపాలుడు పాపం టార్చి లైటుతో వెతకసాగాడు దొడ్డిలో.

ఈలోపల గబగబా మాలతి గోపాలం గది తలుపుకు గొళ్లెంపెట్టి వీధి తలుపులుకూడా బంధించి లోపలకు వచ్చింది. ఇంకేముంది ప్రేమ చెరసాలలో గోపాలం ఒక ఖైదీగా చేయపడ్డాడన్నమాటే! నవ్వుముఖంతో గోపాలం దగ్గరకువచ్చి "ఏమండీ...పాము కనపడలేదా మీకు. పోనీలెండి వెధవపాము కోసం ఏం శ్రమపడతారు?" అంది. మాలతి నవ్వుముఖం ఆమె మాట్లాడిన మాటలతీరు చూచి, యిదేదో "పద్మవ్యూహం" అని చప్పున గ్రహించ కలిగాడు. ఏం మాట్లాడాలో తెలియక "అనంతయ్యగారు ఏరీ?" అంటూ ప్రశ్నించాడు. "లేరు లెండి" అంది మాలతి నిర్లక్ష్యంగా. గోపాలం యింకేం మాట్లాడక గబగబా బైటకు రాసాగాడు తన గదిలోనికి పోవడానికి – వెంటనే మాలతి అతడి త్రోవకు అడ్డుగా నిలచి "ఏమండీ...ఇంకా మీరు నన్ను అర్థం చేసుకోలేదా?" అంది. అతడిని మరింతగా సమీపిస్తూ...గోపాలానికి మతిపోయినట్లయింది. ఏమి మాట్లాడాలో అర్థం కావడం లేదు. అసలు ఆ సమయంలో ఆమెకు నీతులు చెప్పడం పతివ్రతలను జ్ఞప్తికి తేవడంవంటి పనులు శుష్క దండగనికూడా అతనికి తెలుసు. ఇక అతడికి ఆ విపత్సమయంలో కొంచం రౌద్ర రసమే శరణ్యంగా తోచింది. వెంటనే ముఖకవళికలు మార్చుకున్నాడు. ఆ మార్పుతోనే వళ్లుకూడా ఒక్కసారి భగ్గుమని మండింది. తనకు మరింత దగ్గర కాబోతూవున్న మాలతిని ఆ ఉద్రేకంలోనే గట్టిగా వెనుకకుత్రోసివేశాడు. ఆ ఉద్రేకంలోనే "చూడండి, ఈ నాటకాలు నా దగ్గర పనికిరావ్" అంటూ కోపంగా వీధితలుపులు తీసుకుని బైట పడ్డాడు. తక్షణమే తనగదిలోకివచ్చి బట్టలువేసుకుని సినిమాహాలువైపు త్రోవతీశాడు వికలమైన మనస్సుతో...

నిరాశతో విడవబడిన మాలతి మొదట కన్నీళ్ళు కార్చకపోయినా ఆ వెనువెంటనే ప్రతీకారవాంఛ తలయెత్తింది ఆమెలో. 'వలచివచ్చిన తనను కాదన్నాడనే పరాభవంతో ఆమె హృదయం బుసలు కొట్టసాగింది –

* * *

మరునాడు అనంతయ్యా రావడం కన్నీటితో చాలాసేపటివరకూ ఏమేమో చెప్పడం జరిగినై. వెంటనే అనంతయ్యా ఉగ్ర నరశింహావతారం దాల్చాడు. ఆ ఉగ్రరూపంతోనే వీధిఅరుగున కూర్చుని "ఏమయ్యా! నీకేం బుద్ధి వుండక్కరలేదు." అంటూ మొదలుపెట్టాడు. గోపాలం ఆశ్చర్యంగా "ఏమిటండీ?" అన్నాడు.

"ఏమిటండీట! ఏమిటండీ! పాపం ఏమీ తెలియని నంగనాచి బయలుదేరాడు. ఆడవాళ్ళు ఒక్కళ్ళూ వుండేసరికి రాత్రి ఒక నాటకమాడడానికి ప్రయత్నించావన్న మాట. ఇదేం సంసారుల యిల్లనుకున్నావా? లేక సానివాడ అని వుద్దేశపడుతున్నావా? అది అరచి గోలచేయడానికి ప్రయత్నిస్తే గదికి తాళంపెట్టి కాళ్లకు బుద్ధిచెప్పావూ?" అంటున్నాడు అనంతయ్యా. గోపాలం వుండబట్టలేక మాలతి చేసిన అభూత కల్పనకు చకితుడై మధ్యలోనే అందుకుని "అనంతయ్యగారూ? మీరు విషయం తెలుసుకోకుండా..." అని ఏదో అనబోయాడు—

అనంతయ్యా గోపాలాన్ని ఏమీ చెప్పనియ్యకుండానే "ఛాత్...ఇక నాకే విషయము అక్కర్లేదు. తక్షణం గది ఖాళీ చెయ్యడమే కావాలి" అన్నాడు. గోపాలం యిక మాట్లాడకుండా గదికి తాళంవేసి బైటకుపోయి పది నిమిషాలు గడిచేసరికే ఒక రిక్షాతోసహా వచ్చాడు. ఇవ్వవలసిన అద్దె అనంతయ్యాకు యిచ్చేసి సామానులన్నీ రిక్షాలో సర్దేశాడు గోపాలం. మాలతి తన ప్రయోజకత్వానికి గర్విస్తూ భర్త ప్రక్కనే నిలబడి వెళ్లిపోయే గోపాలాన్ని ఎర్రగా చూడసాగింది

ఇక రిక్షాలో ఎక్కబోతూ గోపాలం "అనంతయ్యాగారూ! శలవ్! ఇంతకూ కథ అడ్డం తిరిగిందిలెండి. ఓ చిన్న సలహా! మీ వీధి గదినిమాత్రం యిక పడుచు కుర్రాళ్లకు అద్దెకివ్వకండి. అంతా నాలాటివాళ్ళుండరు. పాపం పతివ్రతలు చెడిపోగలరు." అన్నాడు. రిక్షా బయలుదేరింది. ఈ మాటలలోని అంతరార్థం తెలియక అనంతయ్యా తెల్లముఖం వేశాడు.

★

ఓట్టో లీలా సెంటు

ఎల్లప్పుడును మీరు మనస్సంతోషముగా ఉండవలయునన్న మా సెంటును ఉపయోగించవలయును. మీరు ఎన్నో సెంట్లను చూచియుందురు. ఈ సెంటును మీరు కొంచం చేతిగుడ్డకైనను, పక్కమీదనైనను పూసిన మీరు ఆనందించుటయే కాక మీ ప్రక్కనవుండు వారందరు వాసనచూచి ఆనందింతురు. ఒకతూరి తీసి వాడినవారికి దీనిగుణము తెలియును.

డ్రామ్ బాటిల్ 1-కి రూ. 1=00

ధనలక్ష్మి అండ్ కో.,

త. పె. నం. 1376 — మదరాసు-1.